Digital, tmedia.net.in

# టీ-మీడియా

సంపుటి : 8
సంచిక : 330
పేజీలు : 3
ఆదివారం 05.07.2026

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## 'మరణం కోసం ఆస్ట్రేలియా వస్తున్న మోదీ'

### ప్రధానికి హత్య బెదిరింపులు



**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :** ప్రధాని నరేంద్ర మోదీ ఆస్ట్రేలియా పర్యటనకు ముందు ఆయనను లక్ష్యంగా చేసుకుని ఫేస్‌బుక్‌లో వచ్చిన హత్య బెదిరింపుపై ఆస్ట్రేలియా అధికారులు దర్యాప్తు చేపట్టారు. 'ది ఆస్ట్రేలియా టుడే' కథనం ప్రకారం జూలై 9న మెల్‌బోర్న్‌లోని మార్వెల్ స్టేడియంలో జరగనున్న "మెల్‌బోర్న్ మీట్స్ మోదీ" కమ్యూనిటీ ఈవెంట్‌ను ప్రమోట్ చేస్తున్న ఒక ఫేస్‌బుక్ పోస్ట్ కామెంట్స్ సెక్షన్‌లో ఈ బెదిరింపు కనిపించింది. అబు ముస్తఫా అనే పేరుతో ఉన్న ఖాతా నుంచి పోస్ట్ చేసిన ఆ కామెంట్‌లో "కార్యక్రమం జరిగేటప్పుడు స్టేడియం పైకప్పులు మూసివేయడం మంచిది, లేదంటే ఆయన తన మరణం కోసమే ఆస్ట్రేలియాకు వస్తున్నట్లు అవుతుంది" అని రాసి ఉంది.ఆ పోస్టుపై దర్యాప్తులో భాగంగా అధికారులు ఖాతాకు సంబంధించిన ఐపీ అడ్రస్‌ను గుర్తించినట్లు 'ది ఆస్ట్రేలియా టుడే' పేర్కొంది. ఆ వ్యవహారంలో ఎవరినైనా అరెస్టు చేశారా లేదా అనే విషయాన్ని ఆస్ట్రేలియన్ ఫెడరల్ పోలీస్ ధ్రువీకరించలేదు. దర్యాప్తుపైనా స్పందించడానికి నిరాకరించారు. అయితే భద్రతా సంస్థలు బెదిరింపును అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ప్రధాని పర్యటనలో ఆయనకు కట్టుదిట్టమైన భద్రత కల్పించడానికి ఆస్ట్రేలియాకు చెందిన పలు ఏజెన్సీలు రంగంలోకి దిగే అవకాశం ఉంది.

# మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క పెద్ద వృక్షమైంది

# సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞత సభ





- రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించిన సీఎం

**టీ మీడియా,జులై4 ,మిడ్జిల్ :** 2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు ఆశీర్వదించడంతో, ఆనాడు మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క ఇవాళ పెద్ద వృక్షమైందన్న సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 20 ఏళ్ల రాజకీయ ప్రయాణం సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్?లో రేవంత్ ?రెడ్డి పర్యటించారు. రాజకీయ ప్రస్థానం 20 ఏళ్లు పూర్తి సందర్భంగా రేవంత్ కృతజ్ఞత సభ నిర్వహించారు. మిడ్జిల్‌లో కృతజ్ఞత సభలో పాల్గొన్న రేవంత్ రెడ్డి జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా విజయానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

### మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారు

మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనే గొప్ప నాయకుడు ఉండేవారని, హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డేనని, ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డేనని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. 2006లో జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన తనను మిడ్జిల్ ప్రజలు అక్కున చేర్చుకున్నారని, తనది ఈ నియోజకవర్గం కాకపోయినా మిడ్జిల్ ప్రజలు నమ్మకంతో గెలిపించారని, మిడ్జిల్ ప్రజలు తనపై పెట్టిన నమ్మకమే ఇవాళ తనను ఈ స్థాయికి తీసుకెళ్లిందని వివరించారు.

### మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలి

మహబూబ్‌నగర్ జిల్లాలోని పలు మండలాల్లో 2006లో డార్క్ మండలాలుగా ఉండేవన్న సీఎం తన రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలానికి ఏదైనా చేయాల్సిన బాధ్యత తనపై ఉందని తెలిపారు. మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని వెల్లడించారు. మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కని కోరుతున్నానని పేర్కొన్నారు. ఒకప్పుడు డార్క్ మండలమైన మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలని పిలుపునిచ్చారు.

### ఆంజనేయస్వామిని దర్శించుకున్న రేవంత్ రెడ్డి



ముందుగా ఊర్కొండ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మిడ్జిల్, ఊర్కొండకు చెందిన నేతలు కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లా నేతలు రేవంత్‌రెడ్డిని సన్మానించారు. తన రాజకీయ అనుచరులను ఆత్మీయంగా పలకరించిన సీఎం ఊర్కొండలో ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు.ఊర్కొండలో ఆంజనేయస్వామి ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు ఆలయాన్ని దర్శించుకున్నారు. సీఎం, మంత్రులకు పూజారులు వేదాశ్వీరచనం, ప్రసాదాలు అందజేశారు. రూ.10 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనుచరులు, నేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న రేవంత్ రెడ్డి : 20 ఏళ్ల క్రితం మిడ్జిల్ జడ్పీటీసీగా రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రస్థానం మొదలైంది.

మిగతా 3లో..

## ఖమేనీ అంత్యక్రియలు

- ఇరాన్ స్పీకర్, విదేశాంగ మంత్రి కన్నీటిపర్యంతం
- హాజరైన భారత బృందం



**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :** ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు ఇరాన్‌లో ప్రారంభమయ్యాయి. ఖమేనీ అంతిమ సంస్కారాలు ఆరురోజుల పాటు జరగనున్నాయి. టెహ్రాన్‌లోని 'గ్రాండ్ మొసల్లా' ప్రార్థనా మైదానంలో అధికారిక వీడ్కోలు కార్యక్రమం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహ్మద్ బాఘెర్ గాలిబాఫ్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. తమ దివంగత నేతను స్మరించుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. ఖమేనీ మరణం తర్వాత టెహ్రాన్‌లో జరుగుతున్న అతిపెద్ద అంతర్జాతీయ ప్రతినిధుల సమావేశం ఇదేనని అంతర్జాతీయ మీడియా రాసుకొచ్చింది.పశ్చిమాసియాలో గత కొన్ని నెలలుగా నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ అంత్యక్రియలకు ఇరాన్ భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. తమ సుప్రీం లీడర్‌ను సాగనంపే వేడుకకు అత్యున్నత స్థాయి రక్షణ, భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశామని టెహ్రాన్ గవర్నర్ మహ్మద్ సాదెగ్ మొతమదియాన్ తెలిపారు. మరోవైపు, ఖమేనీ అంతిమ యాత్ర ఇరాక్‌లోనూ కొనసాగనుంది.

మిగతా 3లో..

## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- ఆమోదం తెలిపిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. జూలై 20 నుంచి ఆగస్టు 13 వరకు ఉభయసభల సమావేశాలు నిర్వహించనున్నారు. మొత్తం 25 రోజుల వ్యవధిలో 19 రోజులపాటు సభా కార్యకలాపాలు కొనసాగనున్నాయి. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పార్లమెంట్ ఉభయసభల సమావేశాలకు ఆమోదం తెలిపారు. కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శనివారం ఆ విషయాన్ని వెల్లడించారు.వర్షాకాల సమావేశాల తేదీలను కిరణ్ రిజిజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు 2026 పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నిర్వహణకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.

మిగతా 3లో..

## భూ భారతి పోర్టల్‌లోకి

# చొరబడిన దొంగలు

- రాత్రికి రాత్రే రూ.కోట్ల విలువైన భూముల మార్పిడి

**టీ మీడియా,జులై4 , హైదరాబాద్ బ్యూరో :** ధరణి/ భూభారతిలోని సాంకేతిక లోపాలను ఆసరాగా చేసుకుని అక్రమార్కులు ఏకంగా పోర్టల్?లోకి చొరబడ్డారు. గుట్టుగా భూముల హక్కులను మార్చేశారు. అసైన్డ్, ప్రభుత్వ భూముల్లోనూ రిజిస్ట్రేషన్లు చేశారు. ప్రభుత్వానికి అందిన ఫోరెన్సిక్ నివేదికలో కీలక అంశాలు ఉన్నాయి. అక్రమాలను తీవ్రంగా పరిణించిన ప్రభుత్వం, చర్యల కోసం ఇప్పటికే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.

### ఓ వ్యక్తి పేరుపైకి రాత్రికి రాత్రే రూ.కోట్ల విలువైన భూములు

హైదరాబాద్ మహానగరాన్ని ఆనుకుని ఉన్న ఓ జిల్లాలో ఓ వ్యక్తి పేరుపైకి రాత్రికి రాత్రే రూ.కోట్ల విలువైన కొన్ని ఎకరాల భూముల మార్పిడి జరిగింది. మరో జిల్లాలో రైతులు ప్రభుత్వానికి చెల్లించిన రిజిస్ట్రేషన్ల ఛార్జీ మొత్తాన్ని మధ్యలోనే కాజేశారు. ఇలాంటి అక్రమాలు సాగుభూముల పోర్టల్‌లో భారీగానే చోటు చేసుకున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ ఏడాది జనవరిలో భువనగిరిలో అక్రమాలు వెలుగు చూడటంతో ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించింది.రెవెన్యూ, సైబర్ క్రైమ్స్, రిజిస్ట్రేషన్లు, ఎన్ఐసీ, సైబర్ సెక్యూరిటీ తదితర రంగాల నిపుణులు రంగంలోకి దిగారు. లోతైన విచారణ తర్వాత సర్కారుకు నివేదిక అందజేశారు. అక్రమాలకు పాల్పడ్డ బాధ్యులపై ఎలా చర్యలు తీసుకోవాలో సిఫార్సు చేయడానికి జిల్లాల కలెక్టర్లు, ఐటీ కమ్యూనికేషన్స్, ఎన్ఐసీ, సైబర్ క్రైమ్? నిపుణులతో ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది.

### ప్రభుత్వానికి చెల్లించిన రిజిస్ట్రేషన్ల ఛార్జీలు స్వాహా

విలువైన భూములే లక్ష్యంగా పోర్టల్‌లో అక్రమాలకు తెగబడ్డట్టు తెలుస్తోంది. ఆధారాలేవీ వెబ్‌సైట్‌లో చేర్చకుండానే కొన్ని భూముల యాజమాన్య హక్కులు మారినట్లు గుర్తించారు. ప్రభుత్వ భూములకు సైతం రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. వివాదాల్లో ఉన్న భూములకూ యాజమాన్య హక్కులు సృష్టించారు. సర్వే నంబర్లు లేని భూములకు కొత్తవి సృష్టించడం వంటి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తోంది. అధికారికంగా దస్త్రాల బట్వాడా లేకుండానే పలు కంప్యూటర్లను వినియోగించినట్లు అనంతరం డిజిటల్ ఫుట్‌ప్రింట్స్‌ను గుర్తించకుండా అక్రమార్కులు జాగ్రత్త పడ్డట్లు భావిస్తున్నారు.పలు మాడ్యూళ్లను వినియోగించి ఇలా హక్కుల మార్పిడి చేసినట్లు ఫోరెన్సిక్ విచారణలో నిపుణుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. ఎవరు ఈ అక్రమాలకు పాల్పడ్డారనేది గుర్తించి, ఎలాంటి చర్యలు చేపట్టాలనేది ప్రత్యేక బృందం ప్రభుత్వానికి నివేదించనుంది. అక్రమార్కులు వినియోగించిన టెక్నాలజీ, అక్రమాల బాధ్యులు, సహకరించింది ఎవరో కూడా గుర్తించనున్నారు.



### ధరణి, భూ భారతిలోని సాంకేతిక లోపాలతో అక్రమాలు

ధరణి పోర్టల్ రూపకల్పన, నిర్వహణను 2020లో ఓ ప్రైవేటు సంస్థ చేపట్టింది. ఆ ఏడాది నవంబర్ రెండో తేదీ నుంచి రిజిస్ట్రేషన్లు-మ్యుటేషన్లు ప్రారంభమయ్యాయి. మీసేవా కేంద్రాల ద్వారా పోర్టల్‌లోని మాడ్యూళ్ల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే ఆ మేరకు సేవలు అందేలా డిజైన్ చేశారు. పోర్టల్‌లో తలెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అప్పటి ప్రభుత్వం 2021 నుంచి దశల వారీగా 33 మాడ్యూళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. అయితే వాటిని ఆసరాగా తీసుకుని కొందరు పోర్టల్‌లోకి చొరబడినట్లు అనుమానిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ధరణి పోర్టల్‌ను భూభారతిగా మార్చింది. కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ భూభారతిని నిర్వహిస్తున్నా, ధరణి నాటి సాంకేతికతే ఉండిపోయింది.

### గుట్టుగా పోర్టల్‌లోకి చొరబడి మార్చేసిన అక్రమార్కులు

పోర్టల్‌లో సరైన సైబర్ రక్షణ లేకపోవడంతో పలువురు చొరబడినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది ఆరంభంలో యాదాద్రి, జగిత్యాల జిల్లాల్లో వెలుగులోకి వచ్చిన రిజిస్ట్రేషన్ల ఛార్జీల దారి మళ్లింపు కూడా ఇదే విధంగా జరిగింది. దాని ఆనుపానులను శోధించగా రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆన్‌లైన్/మీసేవా కేంద్రాలకు లింకులు ఉన్నట్లు గుర్తించారు. వాటిలో కొందరు నిర్వాహకులను కూడా విచారించారు. ఇదే తరహాలో ఉమ్మడి రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో భూ యాజమాన్య హక్కులను కూడా మార్చినట్లు తెలిసింది. సాంకేతికతపై పట్టున్న పలువురు, రెవెన్యూ కార్యకలాపాలతో సంబంధం ఉన్న మరికొందరు కలిసి ఈ అక్రమాలకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో నిర్వహించిన ఫోరెన్సిక్ ఆడిట్‌లో పలు కీలక అంశాలు వెలుగులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా అనుమానం ఉన్న చోట్ల ఆడిట్ నిర్వహించారు. సాంకేతిక లోపాలను అవకాశంగా తీసుకునే భూదస్త్రాల్లో మార్పులు, యాజమాన్య హక్కుల బదిలీల్లో అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించినట్టు తెలుస్తోంది.

## కవిత పార్టీకి బ్రేక్.. మార్పు తప్పదా..?

2లో..

## కుప్పం ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం

3లో..



# 23 ఏళ్లు కొండను తొలిచి

- **25 గ్రామాల తలరాతను మార్చేసిన తాత!**

**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :**

భార్య ప్రాణం కాపాడలేకపోయాననే బాధతో 22 ఏళ్ల పాటు కొండను తొలిచి రహదారి నిర్మించిన బిహార్‌కు చెందిన దశరథ్ మాంఝీ కథను ప్రపంచం అంత సులభంగా మర్చిపోదు. అయితే ఇప్పుడు అదే బిహార్‌లో మరో 'మౌంటెన్ మ్యాన్' తన అసాధారణ సంకల్పంతో అందరినీ ఆశ్చర్యపరిచారు. ఒక సాధారణ ట్రక్ డ్రైవర్, సరైన రహదారి లేక తన గ్రామ ప్రజలు అనుభవిస్తున్న కష్టాల్ని చూసి తన జీవితాన్నే పణంగా పెట్టాడు. చేతిలో సుత్తి, ఉలి తప్ప మరో యంత్రం లేదు. ఆర్థిక స్థోమత అంతకన్నా లేదు. అయినా రోజూ కొండను కొడుతూ 23 ఏళ్ల పాటు శ్రమించాడు. చివరకు అసాధ్యం అనుకున్న పనిని చేసి చూపించాడు. 25 గ్రామాల తలరాతే మార్చేశాడు. ఒకప్పుడు ఏ పనీ పాట లేకుండా ఇలా చేస్తున్నాడేంటీ పిచ్చోడు అంటూ ఎగతాళి చేసిన గ్రామస్థులే ఇప్పుడు ఆయన్ను గౌరవంగా 'మౌంటెన్ మ్యాన్ 2' అని పిలుచుకుంటున్నారు. ఆయనే రామ్‌చంద్ర యాదవ్.గయా జిల్లాలో జన్మించిన రామ్‌చంద్ర యాదవ్?కు చిన్నతనంలోనే తీవ్రమైన ఆటుపోటులు ఎదురయ్యాయి. ఆయన పదేళ్ల వయసులోనే తండ్రికి ఎవరో విషమిచ్చి చంపేశారు. దీంతో కుటుంబ పరిస్థితులు తలకిందులయ్యాయి. తర్వాత తన మేనమామ గ్రామమైన కేవ్టీలో స్థిరపడ్డారు. అప్పట్లో ఆ గ్రామం చుట్టూ ఉన్న పెద్ద కొండ కారణంగా ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడటం గమనించారు రామ్‌చంద్ర. దీంతో అదే కొండ తన జీవిత లక్ష్యంగా మారిపోయింది.



పెద్దయ్యాక ట్రక్ డ్రైవర్‌గా పనిచేస్తూ వచ్చిన రామ్‌చంద్రను రోజూ గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలు తీవ్రంగా కలచివేసేవి. ఊరికి సరైన రహదారి లేకపోవడంతో గర్భిణులు ఆస్పత్రికి సమయానికి చేరుకోలేక ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని కొండ దాటించి ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చేది. విద్యార్థులు బడులకు, రైతులు మార్కెట్‌కు వెళ్లాలన్నా కొండల మీదుగా నడవడం తప్ప మరో మార్గం ఉండేది కాదు.

**కూర్చుంటే కొండలు పగలవు- మాంఝీ చెప్పిన మాటతో :** బిహార్‌కే చెందిన ప్రముఖ మౌంటెన్ మ్యాన్ దశరథ్ మాంఝీ కొండను తొలిచి రహదారి నిర్మించిన విషయం తెలుసుకున్న రామ్‌చంద్ర 1992లో ఒకసారి ఆయనను స్వయంగా కలిసి తన గ్రామ సమస్యను వివరించారు. 'మా ఊరికి కూడా మీరు రోడ్డు వేయండి' అని కోరగా మాంఝీ ఇచ్చిన సమాధానం రామ్‌చంద్ర జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. 'నువ్వే ఎందుకు చేయవు. కూర్చుంటే కొండలు పగలవు' అని మాంఝీ చెప్పడంతో రామ్‌చంద్రలో పట్టుదల పెరిగింది. అలా సుమారు ఏడాది పాటు కొండను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత 1993లో రామ్ చంద్ర చేతిలో ఉలి, సుత్తి పట్టుకొని కొండ తొలిచే పని ప్రారంభించాడు. రోజూ ఉదయం గ్రామమంతా 'టన్- టన్- టన్' అనే శబ్దంతోనే మేల్కొనేది. మొదట్లో ఆ శబ్దాన్ని, ఆయనను చూసి జనం నవ్వుకున్నారు. 'ఇంకో పిచ్చోడు వచ్చాడు. 2 రోజుల్లో మానేస్తాడు' అంటూ ఎగతాళి చేశారు. కానీ అది ఒకటి, 2 రోజులతో ఆగలేదు. ఏళ్ల పాటు శ్రమించారు.

**25 గ్రామాలకు కొత్త వెలుగులు :** అయితే, రామ్‌చంద్ర పెద్దగా చదువుకోలేదు. సంతకం కూడా సరిగా చేయలేనని ఆయన చెబుతారు. అయినప్పటికీ తన సంకల్పాన్ని మాత్రం వదల్లేదు. 1993 నుంచి 2015 వరకు దాదాపు ప్రతి రోజూ కొండను కొడుతూనే వచ్చారు. పగలంతా శ్రమించి, రాత్రిళ్లు విశ్రాంతి తీసుకునేవారు. కుటుంబ పోషణ కోసం చేస్తున్న ట్రక్ డ్రైవింగ్ ఉద్యోగం కూడా వదిలేశారు. దీంతో కుటుంబం తీవ్ర పేదరికంలోకి వెళ్లింది. ఎన్నో రోజుల పాటు ఒకపూట భోజనమే చేసి, మరో పూట ఆకలితోనే నిద్రపోయిన సందర్భాలు ఉన్నాయని ఆయన కుమారుడు మున్నా కుమార్ చెబుతున్నారు.

**25 గ్రామాలకు రాకపోకలు :** అలా 23 ఏళ్ల నిరంతర శ్రమ తర్వాత రామ్‌చంద్ర సుమారు 15 నుంచి 30 అడుగుల ఎత్తున్న కొండను తొలిచి 15 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మించారు. ఆ రహదారితో కేవ్టీ, కతల్పురా, లోర్ గంగ్టీ, కొలుహరా, ఇత్రా, బుంచార్, పియార్, నందూ బిఘా, నరహత్, రద్వానా, బద్వానా ఇలా దాదాపు 25 గ్రామాలకు రాకపోకలు సులభమయ్యాయి. ఇంతకుముందు గయా పట్టణానికి వెళ్లి రావాలంటే దాదాపు 7 కిలోమీటర్లు తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అది 3-4 కిలోమీటర్లకు తగ్గిపోయింది. ప్రస్తుతం రోజూ వందలాది వాహనాలు, స్కూల్ బస్సులు ఈ రహదారిగుండా ప్రయాణిస్తున్నాయి. దాదాపు లక్ష మందికిపైగా ప్రజలు దీని ద్వారా ప్రయోజనం పొందుతున్నట్లు గ్రామ స్థులు చెబుతున్నారు. 2015లో రహదారి పూర్తయిన తర్వాత ప్రభుత్వం దానిని అభివృద్ధి చేస్తుందని రామ్‌చంద్ర ఆశించారు. కానీ అటవీ శాఖ ఆయనపై కేసు నమోదు చేసి జైలుకు పంపింది. అయినా ఆయన ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ప్రస్తుతం అదే రహదారిని మరింత మెరుగుపర్చేందుకు (లెవెల్ చేసేందుకు) రోజూ ఉలి, సుత్తితో పనిచేస్తూనే ఉన్నారు.

## ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ప్రారంభోత్సవం

**టీ మీడియా, జూలై 4, టేక్మాల్ :**




టేక్మాల్ మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను శనివారం లబ్ధిదారుల సమక్షంలో లాంఛనంగా ప్రారంభించారు. టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్, స్థానిక సర్పంచ్ సుధాకర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) సత్యనారాయణ, ఎంపీఓ రియాజుద్దీన్ మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కలిసి రిబ్బన్ కట్ చేసి ఈ గృహాలను ప్రారంభించారు.నిరుపేదలకు గౌరవప్రదమైన నివాసమే ప్రభుత్వ లక్ష్యంఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నిమ్మ రమేష్ మరియు సర్పంచ్ సుధాకర్ మాట్లాడుతూ, సమాజంలోని నిరుపేదలకు ఆత్మగౌరవంతో కూడిన సురక్షితమైన, గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. నూతన గృహాలను పొందిన లబ్ధిదారులకు వారు ఈ సందర్భంగా ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న మరియు అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని వారు సూచించారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభోత్సవ కార్యక్రమంలోసీనియర్ కాంగ్రెస్ నాయకులు నారాయణమాజీ కో-ఆప్షన్ సభ్యుడు షేక్ మజార్బొ డ్మట్‌పల్లి సర్పంచ్ తలారి అవినాష్ కుమార్టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కిషోర్మాజీ సర్పంచ్ పాపయ్యఎస్టీ సెల్ నాయకుడు సేవాలాల్బలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, లబ్ధిదారులు మరియు గొల్లగూడెం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఇళ్లు పొందిన లబ్ధిదారుల కుటుంబాల్లో ఈ సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది.

## మమతా బెనర్జీకి బిగ్ షాక్..
### అన్ని పదవులకు టీఎంసీ రాష్ట్ర అధ్యక్షురాలు రాజీనామా

**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఊహించని భారీ ఊపుడు వచ్చింది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి అత్యంత ఆప్తురాలైన బెంగాల్ టీఎంసీ రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రమా భట్టాచార్య తన పదవికి, అలాగే పార్టీలోని అన్ని రకాల బాధ్యతలకు రాజీనామా చేశారు. ఈ హఠాత్ పరిణామం టీఎంసీ పార్టీలో తీవ్ర కలకలం రేపుతోంది.మమతా బెనర్జీకి పంపిన అధికారిక లేఖలో చంద్రమా భట్టాచార్య తన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. 2026 జూన్ 3న కాళీఘాట్‌లో జరిగిన కీలక సమావేశంలో తనకు అప్పగించిన అఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. కేవలం అధ్యక్ష పదవి మాత్రమే కాకుండా, పార్టీలో తాను నిర్వహిస్తున్న అన్ని అనుబంధ, ఇతర సంస్థాగత





బాధ్యతల నుంచి కూడా పూర్తిగా తప్పుకుంటున్నట్లు లేఖలో స్పష్టం చేశారు.అంతేకాకుండా, పార్టీకి సంబంధించిన ఆర్థిక వ్యవహారాల నుంచి కూడా ఆమె వైదొలిగారు. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌తో పాటు దానికి అనుబంధంగా ఉన్న పలు విభాగాలు వివిధ బ్యాంకుల్లో నిర్వహిస్తున్న ఖాతాలకు 'అధీకృత సంతకం' చేసే బాధ్యతను కూడా వదులుకుంటున్నట్లు వెల్లడించారు. దీంతో పాటు, భారత ఎన్నికల సంఘం ముందు పార్టీ తరపున వ్యవహరించే అధీకృత ప్రతినిధి పాత్రకు ఇచ్చిన సమ్మతిని కూడాఆమె ఉపసంహరించుకున్నారు.అయితే, చంద్రమా భట్టాచార్య తన రాజీనామాకు గల ఖచ్చితమైన కారణాలను ఎక్కడా ప్రస్తావించలేదు. మమతా బెనర్జీకి అత్యంత విశ్వసనీయమైన, బలమైన నాయకురాలిగా గుర్తింపు పొందిన చంద్రమా.. ఇలా ఒక్కసారిగా అన్ని పదవుల నుంచి, ఆర్థిక బాధ్యతల నుంచి తప్పుకోవడం వెనుక పార్టీ అంతర్గత విభేదాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో చర్చలు నడుస్తున్నాయి.ఈ హఠాత్ రాజీనామాపై తృణమూల్ కాంగ్రెస్ అధిష్టానం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన లేదా స్పందన రాలేదు. బెంగాల్ రాజకీయాల్లో కీలక భూమిక పోషిస్తున్న చంద్రమా భట్టాచార్య నిర్ణయం.. రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయ సమీకరణాలను ఏ విధంగా మార్చబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## వైద్య సేవల్లో డ్రోన్లు

- **గిరిజన ప్రాంతాలకు సకాలంలో మందులు, రిపోర్టులు**

**టీ మీడియా, జులై 4 , అల్లూరి సీతారామరాజు :**



మారుమూల గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల్లో డ్రోన్ల వినియోగం దిశగా ప్రభుత్వం చేసిన కసరత్తు కార్యరూపం దాల్చింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని గిరిజన ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. డ్రోన్లతో మందులు, బ్లడ్ యూనిట్లు పంపి అక్కడి నుంచి రక్త, మల, మూత్ర నమూనాలు వైద్య పరీక్షల కోసం తీసుకొచ్చే ప్రణాళికలు కార్యరూపం దాల్చాయి. అరుణాచల్‌ప్రదేశ్‌లో డ్రోన్ సేవలందిస్తున్న రెడ్‌వింగ్ సంస్థతో రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ గతేడాది డిసెంబరులో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా 'ప్రూఫ్ ఆఫ్ కాన్సెప్ట్' కింద ప్రాథమిక సేవలు పాడేరు కేంద్రంగా ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ఇక్కడి నుంచి చుట్టుపక్కల పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులకు డ్రోన్ ద్వారా రిపోర్టులు, ఔషధాల సరఫరా గత కొంతకాలంగా చేపట్టారు.

**3 దశల్లో సేవల విస్తరణ**

అల్లూరి జిల్లావ్యాప్తంగా మూడు దశల్లో డ్రోన్ ద్వారా వైద్యసేవలు విస్తరించనున్నారు. ప్రస్తుతం మొదటి దశలో ఎనిమిది వైద్యారోగ్య కేంద్రాల్లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. వీటిలో చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి, ముంచంగిపుట్టు సీహెచ్‌సీ, భీమవరం, తాజంగి, సుంకరిమెట్ట, లోతుగెడ్డ, అనంతగిరి పీహెచ్‌సీలు ఉన్నాయి. రోజూ రక్త నమూనాలను ఆయా ఆసుపత్రులు నుంచి జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌కు డ్రోన్ తీసుకొస్తోంది. ఇక్కడ నుంచి ముందు రోజు రిపోర్టులు, అవసరమైన మందులు తీసుకెళ్లి అందిస్తోంది. రెండో దశలో మరో 10 వైద్యశాలల్లో ప్రారంభిస్తారు. మూడో దశలో మిగిలిన ఆసుపత్రులకూ సేవలు విస్తరిస్తారు.

**పాడేరులోని డ్రోన్ హబ్ నుంచి**

పాడేరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 80 సెంట్ల స్థలంలో డ్రోన్ హబ్ ఏర్పాటు చేశారు. ఇక్కడ నుంచి 100 కి.మీ. పరిధిలోని వైద్యశాలలకు డ్రోన్ సేవలు అందిస్తున్నారు. ఆసుపత్రుల దగ్గర డ్రోన్ ఆపరేటింగ్ తెలిసిన ఒకరిని, వైద్యుల నుంచి నమూనాలు, మందులు తెచ్చి, ఇచ్చేలా మరొకరిని నియమించారు. అక్కడ నుంచి ఎగిరి వచ్చిన డ్రోన్ పాడేరులో దిగిన తర్వాత ఇక్కడ నుంచి బైక్ రన్నర్‌తో జీజీహెచ్‌కు నమూనాలు చేరవేస్తారు. మళ్లీ జీజీహెచ్‌లో సిద్ధంగా ఉన్న మందులు, రిపోర్టులు తీసుకొచ్చి డ్రోన్‌లో ఉంచుతారు. ప్రస్తుతం నాలుగు డ్రోన్లు ఉండగా మూడింటి ద్వారా తొలి దశ సేవలు అందిస్తున్నారు. మరొకటి అత్యవసర సేవలకు వీలుగా అందుబాటులో ఉంచారు.

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి మండలం తాజంగి పీహెచ్‌సీ ఎదుట డ్రోన్ ఇటీవల వచ్చివాలింది. సిబ్బంది వెంటనే అప్పటికే సేకరించిన రక్త నమూనాలను కిట్‌లో పెట్టి అందులో ఉంచారు. వెంటనే అది గాల్లోకి ఎగిరిపోయింది. తర్వాత రోజు అదే సమయానికి డ్రోన్ మళ్లీ రక్త నమూనాల రిపోర్టులతో వచ్చి వాలింది. చింతపల్లి పీహెచ్‌సీలో ఈ నెల 23న మలేరియా మందుల కొరత ఏర్పడింది. జిల్లా కేంద్రం పాడేరులోని జీజీహెచ్‌కు సమాచారం ఇచ్చిన 40 నిమిషాల్లోనే డ్రోన్ ఔషధాలను మోసుకొచ్చింది.

## భూదమ్మకి ఇందిరమ్మ ఇల్లు

- **కట్టిస్తామని భరోసా ఇచ్చిన చైర్ పర్సన్**

**టీ మీడియా, జులై 4, రామకృష్ణాపూర్:**



క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లో 17వ వార్డు శ్రీనివాస నగర్ లో నివాసం ఉంటున్న వితంతు,వృద్ధురాలు భూదమ్మ ఇల్లు ఇటీవల కురిసిన వర్షాల వల్ల కుంగిపోయి గోడ కూలిపోయిందని విషయాన్ని తెలుసుకొని శనివారం వారి ఇంటికి వెళ్లి భూదమ్మను కలిసి తనకు ధైర్యం చెప్పిన పుర చైర్ పర్సన్ గోడిసెల సంధ్యారాణి,బిఆర్ఎస్ నాయకులు ఇల్లు కట్టిస్తామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రభుత్వ ఇల్లు పూర్తి అయ్యేట్లు చేస్తామని అన్నారు.పుర పరిధిలో ఎవరైన ఇల్లు లేక ఇబ్బంది పడుతుంటే మున్సిపాలిటీ ఆఫీసుకి వచ్చి వినతిపత్రం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ పార్టీలకు అతీతంగా, కులాలకు,మతాలకు అతీతంగా ఇబ్బందిలో ఉన్న ప్రజలకు తగినంత సహాయం,న్యాయం చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్ బబ్బెర స్వర్ణలత,మాజీ వార్డు కౌన్సిలర్ రామిడి ఉమ, కుమార్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ భవనంపై నుంచి దూకి విద్యార్థి ఆత్మహత్య!

**టీ మీడియా,జులై4 , హైదరాబాద్ బ్యూరో :**



హైదరాబాద్‌లో తీవ్ర విషాదం వెలుగు చూసింది. గచ్చిబౌలిలోని ట్రిపుల్ ఐటీలో ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లాలకు చెందిన అభిరూప్‌గా అనే విద్యార్థి ట్రిపుల్ ఐటీ భవనంపై నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్ట్‌మార్టం నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు. ఘటనపైకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పాక్ కోస్ట్ గార్డ్స్ క్యాంపుపై భారీ దాడి

- **30 మందికిపైగా మృతి చెందినట్లు బలూచిస్థాన్ ప్రకటన**

**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :**

పాకిస్థాన్‌లోని బలూచిస్థాన్ ప్రాంతంలో మరో భారీ దాడి జరిగినట్లు బలూచ్ లిబరేషన్ ఆర్మీ ప్రకటించింది. గ్వాదర్ జిల్లాలోని జీవానీ పరిధిలో ఉన్న పన్వాన్ ప్రాంతంలోని పాకిస్థాన్ కోస్ట్ గార్డ్స్ క్యాంపును లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు తెలిపింది. ఈ ఘటనలో 30 మందికిపైగా భద్రతా సిబ్బంది మృతి చెందారని, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది. అయితే బీఎల్ఏ చేసిన ఈ ప్రకటనపై పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి అధికారిక ధ్రువీకరణ రాలేదు.బలూచ్ లిబరేషన్ ఆర్మీ శుక్రవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం, జులై 3న సాయంత్రం 6.32 గంటల సమయంలో ఈ దాడి జరిగింది. తమ మజీద్ బ్రిగేడ్‌కు చెందిన సభ్యుడు పేలుడు పదార్థాలతో నింపిన మాజ్దా వాహనాన్ని కోస్ట్ గార్డ్స్ క్యాంపులోకి తీసుకెళ్లి పేల్చినట్లు బీఎల్ఏ పేర్కొంది. ఈ భారీ పేలుడు కారణంగా కోస్ట్ గార్డ్స్ క్యాంపు తీవ్రంగా దెబ్బతిన్నట్లు తెలిపింది. పేలుడు అనంతరం తమ ఫతేహ్ స్క్వాడ్‌కు చెందిన సభ్యులు క్యాంపుపై దాడి చేసినట్లు వెల్లడించింది. పేలుడు నుంచి బయటపడిన భద్రతా సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని దాడులు కొనసాగించినట్లు పేర్కొంది.ఈ ఘటనలో 30 మందికిపైగా పాకిస్థాన్ భద్రతా సిబ్బంది మృతి చెందినట్లు బీఎల్ఏ ప్రకటించింది. మరికొందరు తీవ్రంగా గాయపడ్డారని తెలిపింది. శిథిలాల కింద మరికొంత మంది చిక్కుకుని ఉండవచ్చని, గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నందున మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొంది. ఘటన జరిగిన వెంటనే పాకిస్థాన్ సైన్యం లేదా కోస్ట్ గార్డ్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. దాడిలో ఎంత మంది మరణించారు? ఎంత మంది గాయపడ్డారు? క్యాంపునకు ఎంత మేర నష్టం జరిగింది? అనే వివరాలపై స్పష్టత రాలేదు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తి వివరాలను కూడా బీఎల్ఏ తన ప్రకటనలో వెల్లడించింది. అతడిని అత్తావుల్లా బలోచ్ అలియాస్ అజ్మల్‌గా పేర్కొంది. తమ మజీద్ బ్రిగేడ్‌లో అతడు సభ్యుడని తెలిపింది. ఈ విభాగం గతంలోనూ పలు దాడులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజా ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలతోపాటు వీడియోను విడుదల చేస్తామని బీఎల్ఏ పేర్కొంది.బలూచిస్థాన్‌లో పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్న వేర్పాటువాద గ్రూపుల్లో బలూచ్ లిబరేషన్ ఆర్మీ ఒకటి. భద్రతా బలగాలు, ప్రభుత్వ కార్యాలయాలు, కీలక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని గతంలో జరిగిన పలు దాడులకు ఈ సంస్థ బాధ్యత ప్రకటించింది. ముఖ్యంగా బలూచిస్థాన్‌లోని తీర ప్రాంతాలు, సహజ వనరులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీఎల్ఏ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. గ్వాదర్ ప్రాంతంలోనూ గత కొన్నేళ్లుగా భద్రతాపరమైన సవాళ్లు ఎదురవుతున్నాయి.పాకిస్థాన్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన గ్వాదర్ పోర్టు ఈ జిల్లాలోనే ఉంది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్‌లో గ్వాదర్ కీలక ప్రాంతంగా ఉంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మౌలిక సదుపాయాలు, భద్రతా బలగాలను లక్ష్యంగా చేసుకుని వేర్పాటువాద గ్రూపులు గతంలోనూ పలు దాడులకు పాల్పడ్డాయి. బలూచిస్థాన్‌కు పూర్తి స్వాతంత్ర్యం వచ్చే వరకు తమ కార్యకలాపాలు కొనసాగుతాయని బీఎల్ఏ తన తాజా ప్రకటనలో పేర్కొంది. పాకిస్థాన్ భద్రతా బలగాలపై తమ దాడులు కొనసాగుతాయని తెలిపింది.అయితే ఇలాంటి దాడులు జరిగిన వెంటనే రెబల్ గ్రూపులు ప్రకటించే మృతుల సంఖ్యకు, ఆ తర్వాత ప్రభుత్వ వర్గాలు వెల్లడించే వివరాలకు మధ్య వ్యత్యాసం ఉండే సందర్భాలు ఉన్నాయి. ఘర్షణలు జరిగే ప్రాంతాల్లోకి స్వతంత్ర మీడియాకు పరిమితమైన అవకాశం ఉండటం వల్ల దాడులకు సంబంధించిన పూర్తి వివరాలను ధ్రువీకరించడం కష్టంగా మారుతోంది. తాజా ఘటనపై పాకిస్థాన్ అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది. బీఎల్ఏ చేసిన ప్రకటనలోని వివరాలు ధ్రువీకరణ అయితే ఇటీవలి కాలంలో గ్వాదర్ ప్రాంతంలో పాకిస్థాన్ భద్రతా బలగాలపై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది ఒకటిగా నిలిచే అవకాశం ఉంది.

# 2 కిలోమీటర్లు - 4 గ్రామాలకు తిప్పలు

- **రహదారి లేక దుర్భర పరిస్థితులు**

**టీ మీడియా,జులై4 , హైదరాబాద్ బ్యూరో :**

ఓ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే ముందుగా అక్కడ రవాణా వ్యవస్థ బలోపేతం కావాలి. కానీ పలుచోట్ల ఇప్పటికీ సరైన రహదారులు లేక ప్రజలకు అవస్థలే మిగులుతున్నాయి. మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న జుక్కల్ మండలంలో ఇదే దుస్థితి నెలకొంది. వర్షాకాలం వస్తే ఇక్కడ రాకపోకలకు దుర్భర పరిస్థితి నెలకొంటోంది. సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రజా ప్రతినిధులు, పాలకులు తమ సమస్యలను పట్టించుకోవట్లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా సమస్యలతో దయనీయంగా మారిన జుక్కల్ మండల ప్రజలు నిత్యం తమ గోడును వెళ్లదీస్తున్నారు.

**రూ.90 లక్షల వంతెన నిరుపయోగం**

కామారెడ్డి జిల్లా జుక్కల్ మండలంలోని మాదాపూర్, చండేగావ్, బిజ్జల్ వాడి, కథల్ వాడి గ్రామాలు మహారాష్ట్ర సరిహద్దులకు సమీప ప్రాంతాలు. ఈ గ్రామాల రైతులు తాము పండించిన పంట, కూరగాయలను నిత్యం మహారాష్ట్రలోని దెగ్లూరు



మార్కెట్?కు తరలిస్తుంటారు. తెలంగాణలోని చండేగావ్, మహారాష్ట్రలోని దేవాపూర్ రోడ్డు మధ్య రూర్బన్ పథకం కింద రూ.90 లక్షల నిధులతో ఓ వంతెన నిర్మించారు. అక్కడి నుంచి దేవాపూర్ వరకు తారు రోడ్డు నిర్మిస్తామని అప్పటి పాలకులు 2023లో రూ.కోటి నిధుల శిలాఫలకం ఆవిష్కరించారు. కానీ తారు రోడ్డు పనులు మొదలు పెట్టకపోవడంతో వానాకాలంలో వంతెన నిరుపయోగంగా మారుతోంది. భారీ వర్షాలు కురిస్తే ఆయా గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

**పంటను అమ్ముకునేందుకు నానా తంటాలు**

వర్షాకాలం మాదాపూర్ సమీపంలోని లో లెవెల్ వంతెన పైనుంచి నీరు పారడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. భారీ వర్షాలు కురిస్తే కొన్ని గ్రామాలు జలదిగ్బంధంలోనూ చిక్కుకుంటున్నాయి. ఆయా గ్రామాల ప్రజలు ఊరు దాటని పరిస్థితి నెలకొంటోంది. దీంతో పంట దిగుబడిని అమ్ముకునేందుకు రైతులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. సమీపంలో ఉన్న దెగ్లూర్ మార్కెట్??కు వెళ్లేందుకు కేవలం 2 కి.మీ రహదారి లేనందున 25 కి.మీ దూరంలో ఉన్న మద్నూర్?కు పంటను తరలించాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అత్యవసరంగా ఆసుపత్రికీ వెళ్లలేమంటూ**

ఏటా రైతులే సొంతంగా నగదు పోగు చేసుకుని మట్టి వేసి రోడ్డు నిర్మాణం చేసుకుంటున్నారు. తీరా వర్షాకాలం వచ్చేసరికి ఆ రోడ్డు కొట్టుకుపోతుంది. అత్యవసర సమయంలో ఆసుపత్రికి వెళ్లేందుకూ నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. రెండు రాష్ట్రాల సరిహద్దు మధ్య కల్వర్టు నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇరు రాష్ట్రాల మధ్య కేవలం రెండు కిలోమీటర్ల మేర తారు రోడ్డు వేసి, ఓ కల్వర్టు నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుందని, ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

## కవిత పార్టీకి బ్రేక్..మార్పు తప్పదా..?

**టీ మీడియా,జులై4 , హైదరాబాద్ బ్యూరో :**



కల్వకుంట్ల కవిత స్థాపించిన 'తెలంగాణ రక్షణ సేన'పార్టీకి ఎన్నికల సంఘం నుంచి కీలక ఆదేశాలు వెలువడ్డాయి. పార్టీ పేరుపై ప్రజల నుంచి భారీగా అభ్యంతరాలు వచ్చిన నేపథ్యంలో, ఆ పేరును కొనసాగించేందుకు వీల్లేదని ఈసీ స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో కొత్తగా ఏర్పాటైన ఈ పార్టీకి ప్రారంభ దశలోనే పెద్ద ఎదురుదెబ్బ తగిలినట్లయింది.తెలంగాణ రక్షణ 'సేన' పేరుపై పలు అభ్యంతరాలు నమోదయ్యాయని ఈసీ లేఖలో పేర్కొంది. అందువల్ల పార్టీ మూడు ప్రత్యామ్నాయ పేర్లు 15 రోజుల్లో సమర్పించాలని సూచించింది. లేకపోతే పార్టీ రిజిస్ట్రేషన్ దరఖాస్తును మూసివేస్తామని హెచ్చరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా 'టీఆర్ఎస్' అనే సంక్షిప్త నామంపై కూడా అభ్యంతరాలు ఉన్నాయని, ఇది ఇప్పటికే ఉన్న రాజకీయ గుర్తింపులతో గందరగోళం సృష్టించే అవకాశం ఉందని కేంద్ర ఎన్నికల సంఘం పేర్కొన్నట్లు సమాచారం.అయితే ఈసీ ఆదేశాలపై కవిత తీవ్రంగా స్పందించారు. టీఆర్ఎస్ పేరు మార్చే ప్రసక్తే లేదని, ఇప్పటికే ఈసీ అభ్యంతరాలకు వివరణ ఇచ్చామని తెలిపారు. రెండు సార్లు లేఖల ద్వారా తమ వైఖరిని స్పష్టం చేసినప్పటికీ, మళ్లీ పేరు మార్చాలని సూచించడం సరైంది కాదని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ అంశంపై న్యాయపరమైన పోరాటానికి సిద్ధంగా ఉన్నట్లు కూడా కవిత స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ఇక టీఆర్ఎస్ పార్టీ ప్రతినిధులు కూడా ఈసీ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తమకు కేవలం రెండు అభ్యంతరాలే తెలియజేయగా, మిగతా అభ్యంతరాలు లేకుండానే ప్రత్యామ్నాయ పేర్లు ఎలా సూచించాలన్న ప్రశ్నను వారు లేవనెత్తారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని టీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు.ఇదిలావుంటే, ఏప్రిల్ 25న 'తెలంగాణ రక్షణ సేన' పేరుతో కవిత కొత్త పార్టీని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాతే పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఈ పరిణామాలతో పార్టీ పేరుపై స్పష్టత రాకుండా కొనసాగుతున్న వివాదం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ పేరు వివాదం మరింత ముదిరితే, రాబోయే రోజుల్లో ఇది న్యాయస్థానానికి చేరే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసులు

- **పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్ తొలగించాలని ఆదేశం**

**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :**

ప్రముఖ మెసేజింగ్ యాప్ టెలిగ్రామ్‌కు కేంద్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసింది. తమ ప్లాట్‌ఫామ్ ద్వారా విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న పైరసీ సినిమాలు, ఓటీటీ కంటెంట్, ఇతర ఆడియో-విజువల్ కంటెంట్‌ను నియంత్రించాలని టెలిగ్రామ్‌ను ఆదేశించింది. ఈవ్యవహారంపై తీసుకున్న చర్యలకు సంబంధించి 15రోజుల్లోగా నివేదిక సమర్పించాలని కేంద్ర సమాచార, ప్రసార శాఖ టెలిగ్రామ్‌ను ఆదేశించింది. పైరసీ కంటెంట్‌ను ఎప్పటికప్పుడు తీసివేయడం ఇకపై ప్లాట్‌ఫామ్‌దే పూర్తి బాధ్యత అనే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందని అధికారులు స్పష్టం చేశారు.నీట్ రీ-ఎగ్జామినేషన్ సమయంలో పేపర్ లీక్‌ను నివారించడానికి ముందుజాగ్రత్త చర్యగా జూన్‌లో టెలిగ్రామ్‌ను తాత్కాలికంగా కేంద్రం బ్లాక్ చేసింది. ప్రభుత్వం ఒక్కో పైరసీ ఛానెల్‌ను గుర్తించి చెప్పే వరకు టెలిగ్రామ్ వేచి చూడకూడదని మంత్రిత్వ శాఖ తేల్చి చెప్పింది. కేవలం ఫిర్యాదు వచ్చినప్పుడు మాత్రమే ఒక్కో ఛానెల్‌ను తొలగించే విధానం ప్లాట్‌ఫామ్ బాధ్యతను నెరవేర్చినట్లు కాదని స్పష్టం చేసింది. మరోవైపు సినీ నిర్మాతలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు, దర్యాప్తు సంస్థల ఫిర్యాదుల పరిష్కారం కోసం టెలిగ్రామ్ అమలు చేస్తున్న యంత్రాంగం వివరాలను కూడా కేంద్ర సమాచార శాఖ కోరినట్లు వర్గాలు తెలిపాయి. ఒక మధ్యవర్తిత్వ సంస్థగా ఐటీ చట్టం, నిబంధనలకు కట్టుబడి ఉండాలని టెలిగ్రామ్‌ను కేంద్రం గట్టిగా హెచ్చరించినట్లు తెలిసింది. పైరసీ కంటెంట్ కొనసాగినా, నిబంధనలను పాటించకపోయినా లేదా అసంపూర్ణమైన సమాధానం ఇచ్చినా కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పాపికొండలు విహారయాత్రకు పచ్చజెండా

- **20 రోజుల బ్రేక్ తర్వాత మళ్లీ బోటింగ్**

**టీ మీడియా,జులై4 , పోలవరం :**



పాపికొండలు విహారయాత్రకు అధికారులు పచ్చజెండా ఊపారు. పాపికొండలు పేరు వినగానే కళ్ల ముందు రమణీయమైన ప్రకృతి దృశ్యాలు కనిపిస్తాయి. ఒకవైపు ఆకాశాన్ని తాకే ఎత్తయిన కొండలు. కింద పరవళ్లు తొక్కే గోదావరి ప్రవాహం. ఆ గోదారిపై లాంచీలో సాగే అద్భుతమైన ప్రయాణం. ఈ మధురానుభూతిని ఆస్వాదించడానికి తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పర్యాటకులు వస్తుంటారు. అయితే ప్రకృతి ఒడిలో ప్రయాణం రమణీయమే అయినప్పటికీ కొంత సాహసమనే చెప్పాలి. దాన్ని దాటి గోదావరిలో బోటు షికారుకు వెళ్తే మనసుకు ఉరకలెత్తాల్సిందే.

**విహారయాత్రకు విరామం ముగిసింది :** పాపికొండలు విహారయాత్రకు అధికారులు పచ్చజెండా ఊపారు. ఇరవై రోజుల తర్వాత శనివారం నుంచి పునరుద్ధరిస్తూ అనుమతులు మంజూరు చేశారు. పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలో గండిపోశమ్మ ఆలయం నుంచి బయలుదేరేందుకు 15 ప్రైవేట్ బోట్లు, ఒక ఏపీటీడీసీ బోటు సిద్ధమయ్యాయి. గత నెల 14న పోశమ్మగండి నుంచి గోదావరిలో విహారయాత్రకు బయలుదేరిన ఓ పర్యాటక బోటు సాంకేతిక లోపంతో నిలిచిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అధికారులు విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేసి, తాజాగా అనుమతులిచ్చారు.

**భద్రతా చర్యలు :** పోలవరం జిల్లాలో పాపికొండలు పర్యటకుల భద్రత కోసం ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గోదావరి నదిలో పాపికొండలు పర్యటనకు వెళ్లే పర్యాటక బోట్లను విస్తృత తనిఖీలు చేయిస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నదిలో తిరిగే బోట్ల భద్రతా ప్రమాణాలను స్థానిక అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇటీవల కాలంలో పలు ఘటనలు జరిగిన దృష్ట్యా అప్రమత్తమైన అధికారులు, భద్రతపై అత్యంత ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలకు ఉపక్రమించారు. విహార యాత్ర తాత్కాలికంగా నిలిపివేసి బోట్లను తనిఖీలు చేపట్టారు. భద్రతా చర్యల అనంతరం ఇప్పుడు మళ్లీ గోదావరిలో పడవ ప్రయాణానికి అధికారులు పచ్చజెండా ఊపారు.

**పాపికొండల టూర్ :** గలగలాపారే గోదారమ్మ, చుట్టూ ఎత్తైన పచ్చని కొండలు, పక్షుల కిలకిలా రావాలు, అల్లంత దూరంలో కనిపించే చిన్న చిన్న గూడేలు, గుడిసెలు కాంక్రీట్ జంగల్?కు దూరంగా ప్రకృతి ఒడిలో ప్రయాణం అనగానే గుర్తొచ్చేది పాపికొండల టూర్ మీరు వెళ్దామనుకుంటున్నారా? మరెందుకు ఆలస్యం ప్రశాంత వాతావరణంలో ప్రకృతి అందాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. పాపికొండల్లోనే బస చేసేలా మరిన్ని ఏర్పాట్లతో ముందుకొస్తోంది.

## మండలాలకు అధ్యక్షులు నియమించిన కాంగ్రెస్ అధిష్టానం

**టీ మీడియా ,జూన్ 4, ఆత్మకూరు:**



వనపర్తి జిల్లా ఆత్మకూరు అమరచింత మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా అధిష్టానం నియమించింది. ఆత్మకూర్ మండల అధ్యక్షుడిగా అక్షర స్కూల్ యస్.నాగేశ్వర్ పట్టణ అధ్యక్షులుగా నియమితులైన చిన్నపాగ శ్రీనివాసులు అమరచింత మండల అధ్యక్షుడిగా రాజేందర్ పట్టణ అధ్యక్షునిగా రవికాంత్ గాని నియమించింది. మండల అధ్యక్షుడు నాగేశ్వర్ మాట్లాడుతూ పార్టీ అప్పగించిన పనిని విజయవంతం చేస్తానని, అందర్నీ కలుపుకొని పోయి వాటిని అభివృద్ధి చేస్తానని ఆయన అన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆశీర్వాదాలతో , టీపీసీసీ ప్రెసిడెంట్ కేశం నాగరాజు గౌడ్ సహకారంతో వాటిని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన అన్నారు.

# కుప్పం ఆస్పత్రి ఆవరణలో చెత్తాచెదారం

● సీఎం చంద్రబాబు ఆగ్రహం

**టీ మీడియా , జులై4 , చిత్తూరు :**
కుప్పం ఏరియా ఆసుపత్రిలో సీటీ స్కాన్ సెంటర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఆ తర్వాత సంజీవని ఎగ్జిబిషన్ స్టాల్‌ను సందర్శించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వైద్య సేవలపై సీఎం ఆరా తీశారు. హాస్పిటల్ ఆవరణలో చెత్తాచెదారం, వ్యర్థాలు ఉండటంపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిస్థితి ఎందుకిలా ఉందని ఆసుపత్రి సూపరింటెండెంట్‌పై అసహనం వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా వ్యర్థాలు క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు.

చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 2వ రోజు పర్యటన కొనసాగుతోంది. నియోజకవర్గ అభివృద్ధి, స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పర్యటన సాగుతోంది. స్థానికులు, పార్టీ అభిమానులు ముఖ్యమంత్రిని కలిసేందుకు భారీగా తరలి వచ్చారు. ఈ క్రమంలో ప్రజల వద్దకు వెళ్లిన సీఎం, వారిని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. స్థానికులతో కాసేపు ముచ్చటించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు తమ నియోజకవర్గ, వ్యక్తిగత సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి పత్రాలు అందజేశారు.



అర్జీలను స్వీకరించిన సీఎం సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**నెట్ జీరో మోడల్ గృహాలు సందర్శన**

అనంతరం చంద్రబాబు నలగంపల్లె గ్రామంలో పర్యటించారు. గ్రామంలో వినూత్నంగా నెట్? జీరో విధానాన్ని అవలంబిస్తోన్న ఇళ్లను సీఎం ప్రత్యేకంగా పరిశీలించారు. పర్యావరణహితంగా రూపుదిద్దుకున్న ఈ ఇళ్లలోని రూఫ్?టాప్ సోలార్ వ్యవస్థ, ఇండక్షన్ కుక్?టాప్ వినియోగం, టెర్రస్ గార్డెనింగ్, వర్షపునీటి సంరక్షణ వ్యవస్థలను క్షుణ్ణంగా పరిశీలించారు.

**సోలార్ విద్యుత్ వినియోగంపై ఆరా**

గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి పర్యావరణహిత పద్ధతులను పాటించడంపై సీఎం హర్షం వ్యక్తం చేశారు. నలగంపల్లిలోని ఓ గ్రామస్థుడి ఇంటికి ముఖ్యమంత్రి స్వయంగా వెళ్లారు. ఆ కుటుంబ సభ్యులతో సీఎం ముచ్చటించారు. అదే విధంగా సోలార్ విద్యుత్ వినియోగంపై ఆరా తీశారు. ఇంటిపై ఎన్ని ప్యానెళ్లు పెట్టారు? సోలార్ ప్యానెళ్ల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ మీ ఇంటి అవసరాలకు సరిపోతుందా? బిల్లులు ఏమైనా తగ్గాయా? అంటూ వివరాలు అడిగి సీఎం తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తమ ఇంటికి రావడం, స్వయంగా వివరాలు అడగడంతో ఆ కుటుంబం ఆనందం వ్యక్తం చేసింది.

**త్వరలో కుప్పంలో బంగారం ఉత్పత్తి చేస్తాం**

రాయలసీమలో రూ.లక్ష కోట్లతో హార్టికల్చర్ హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. ఇందులో ప్రైవేటు రంగం వాటా రూ.60 వేల కోట్లు కాగా ప్రభుత్వం రూ.40 వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నట్లు చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో రెండో రోజు పర్యటించిన చంద్రబాబు రూ.117 కోట్లతో అధునాతన బస్‌స్టేషన్, డిపో నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కుప్పం చరిత్ర మార్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు స్వర్ణ కుప్పానికి నాంది పలుకుతాయన్నారు.

# మిడ్జిల్ ప్రజలు నాటిన మొక్క పెద్ద వృక్షమైంది

జడ్పీటీసీ, ఎమ్మెల్సీగా తన విజయానికి సహకరించిన వారిని కలిసిన సీఎం మిత్రులతో కలిసి ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. రేవంత్ రెడ్డితో ఉన్న అనుబంధాన్ని పలువురు కార్యకర్తలు గుర్తు చేశారు. మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది: సీఎం తన రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టిని కోరుతున్నానని సీఎం వ్యాఖ్యానించారు. ఒకప్పుడు డార్క్ మండలమైన మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలని ఆయన ఆకాంక్షించారు.

**ప్రజలకు కృతజ్ఞతలు**

2006 జులై 4న మిడ్జిల్ మండల ప్రజలు ఆశీర్వదించారని.. ఆనాడు మీ నాటిన మొక్క.. ఇవాళ పెద్ద వృక్షమైందన్నారు సీఎం రేవంత్ రెడ్డి. తన రాజకీయ ప్రస్థానంలో కీలకమైన మిడ్జిల్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు గతంలోనే గొప్ప నాయకుడు ఉండేవారని, హైదరాబాద్ రాష్ట్రానికి తొలి సీఎంగా చేసిన బూర్గుల రామకృష్ణారావు మహబూబ్‌నగర్ బిడ్డేనని సీఎం గుర్తుచేశారు. ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి సేవలందించిన జైపాల్‌రెడ్డి ఈ జిల్లా బిడ్డేనన్నారు.

**మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత నాపై ఉంది**

తన రాజకీయ జీవితంలో కీలకమైన మిడ్జిల్ మండలాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మిడ్జిల్ మండలాన్ని దత్తత తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టిని కోరుతున్నానని సీఎం వ్యాఖ్యానించారు. ఒకప్పుడు డార్క్ మండలమైన మిడ్జిల్ అభివృద్ధి చెందిన మండలంగా మారాలని ఆయన ఆకాంక్షించా రు.

**ఆకలి తెలిసిన నేత కాబట్టే: భట్టి**

20 ఏళ్లలో రేవంత్‌రెడ్డి ప్రయాణం ఎన్నో దశలుగా సాగిందన్నారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. జడ్పీటీసీ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఎంపీ, చివరగా సీఎం వరకు ఎదిగారని, తన పదవులకు పునాది వేసిన వారిని కలవాలని సీఎం రేవంత్‌రెడ్డి భావించారని, అందుకే ఇక్కడ వరకు వచ్చారన్నారు. పాలన అంటే.. కేవలం అధికారులతో కలిసి చర్చలు చేయటం కాదని, చిన్నప్పటి నుంచి చూసిన ప్రజల కష్టాలకు పరిష్కారం చూపటమే నిజమైన పాలన అని వ్యాఖ్యానించారు. ప్రజల ఆకలి తెలిసిన నేత కాబట్టే.. సన్నబియ్యం గురించి ఆలోచన చేశారని ప్రశంసించారు.

# ఖమేనీ అంత్యక్రియలు

**అంత్యక్రియలకు భారత్ తరపున హాజరు**

ఖమేనీ అంత్యక్రియలకు భారత్ తరఫున ప్రతినిధులు హాజరయ్యారు. ఇరాన్‌కు ఉన్న దౌత్యపరమైన సంబంధాల నేపథ్యంలో అంత్యక్రియలకు భారత్ తరఫున ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం హాజరైంది. కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరీటా, బిహార్ గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హస్నైన్ అంత్యక్రియలకు హాజరైనట్లు విదేశాంగ శాఖ తెలిపింది. అలాగే, శుక్రవారం ఖమేనీ భౌతికకాయానికి నివాళులర్పించారు. భారత ప్రజల తరఫున వారు ఇరాన్ తాత్కాలిక ప్రభుత్వానికి తమ తీవ్ర సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ, కాంగ్రెస్ విదేశీ వ్యవహారాల విభాగం అధిపతి సల్మాన్ ఖుర్షీద్‌తో పాటు పలువురు భారతీయ ప్రతినిధులు నివాళులర్పించిన చిత్రాలను పంచుకుంది.

**తరలివచ్చిన దేశాల అధినేతలు**

ఖమేనీ అంత్యక్రియలకు ఇరాన్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగిన రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ దిమిత్రి మెద్వెదేవ్ శుక్రవారం హాజరయ్యారు. ఆయనకు ఇరాన్ అధ్యక్షుడు మాసౌద్ పెజెష్కియాన్, విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్వాగతం పలికారు. తజికిస్థాన్ అధ్యక్షుడు ఎమోమాలి రెహమాన్, పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్, ఇరాక్ అధ్యక్షుడు నిజార్ అమేది, అర్మేనియా ప్రధాని నికోల్ పాషిన్యాన్ ఖమేనీ అంతిమ సంస్కారాలకు హాజరయ్యారు. దాదాపు 100 దేశాలకు చెందిన ప్రజా సంఘాలు, ప్రముఖులు పాల్గొనున్నట్లు వెల్లడించారు. అయితే, ఇరాన్‌పై అమెరికా- ఇజ్రాయెల్ జరిపిన సైనిక దాడికి ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా మద్దతు పలికిన పశ్చిమ ఐరోపా దేశాలకు మాత్రం ఇరాన్ ఆహ్వానాలు పంపలేదని ఆయన స్పష్టం చేశారు.

**6రోజుల అంతిమ సంస్కారాలు**

ఖమేనీ అంతిమ సంస్కారాలు 6రోజుల పాటు సాగనున్నాయి. జులై 4 నుంచి 5వ తేదీ వరకు టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లాలో ఖమేనీ భౌతికకాయాన్ని ప్రజల సందర్శనార్థం ఉంచుతారు. జులై 6న టెహ్రాన్ వీధుల్లో ఇమామ్ హుస్సేన్ స్క్వేర్ నుంచి అజాది స్క్వేర్ వరకు దాదాపు 10 కిలోమీటర్ల మేర భారీ అంతిమ యాత్ర నిర్వహిస్తారు. జులై 7న ఇరాన్ ప్రముఖ ఆధ్యాత్మిక నగరమైన ఖోమ్‌కు భౌతికకాయాన్ని తరలించి అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. జులై 8న షియా ముస్లింల పవిత్ర నగరాలైన ఇరాక్‌లోని బగ్దాద్, కర్బలా, నజాఫ్ నగరాల్లోని పుణ్యక్షేత్రాలకు భౌతికకాయాన్ని తరలించి నివాళులర్పిస్తారు. జులై 9న ఇరాన్ రెండో అతిపెద్ద నగరమైన మషాద్‌లోని ప్రసిద్ధ 'ఇమామ్ రెజా' పవిత్ర క్షేత్రంలో ఖమేనీ అంత్యక్రియలు పూర్తి కానున్నాయి.

# 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

జులై 20న ప్రారంభమయ్యే సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగుతాయని తెలిపారు. జాతీయ ప్రాధాన్యం కలిగిన అంశాలపై అర్థవంతమైన చర్చలు, సంభాషణలు, నిర్ణయాలకు ఈ సమావేశాలు వేదికగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి పార్లమెంట్ సమావేశాలు రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇటీవల జరిగిన పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారిగా ఉభయసభలు సమావేశం కానున్నాయి. బంగాల్, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో అధికార భారతీయ జనతా పార్టీ విజయాలు సాధించిన నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాలపై ఆసక్తి నెలకొంది. మారిన రాజకీయ సమీకరణాల ప్రభావం ఉభయసభల కార్యకలాపాలపై కనిపించే అవకాశం ఉంది. తృణమూల్ కాంగ్రెస్, శివసేన (యూబీటీ) పార్టీల్లో చోటుచేసుకున్న పరిణామాలు సైతం వర్షాకాల సమావేశాల్లో చర్చనీయాంశంగా మారనున్నాయి. తమను ప్రత్యేక గ్రూపులుగా గుర్తించాలని కోరుతూ 20 మంది తృణమూల్ కాంగ్రెస్ ఎంపీలు, ఆరుగురు శివసేన (యూబీటీ) ఎంపీలు చేసిన విజ్ఞప్తులపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీంతో స్పీకర్ తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. మరోవైపు రాజ్యసభలోనూ రాజకీయ సమీకరణాలు మారాయి. కొత్తగా ఎన్నికైన, తిరిగి ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత అధికార ఎన్డీయేకు సంఖ్యాబలం మరింత అనుకూలంగా మారింది. రాజ్యసభకు చెందిన ముగ్గురు తృణమూల్ కాంగ్రెస్ రెబల్ ఎంపీలు రాజీనామా చేయడంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగనున్నాయి. వీటి ఫలితాలతో ఎగువ సభలో బీజేపీ మరింత బలం పెంచుకునే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. ఈసారి వర్షాకాల సమావేశాల్లో పలు కీలక బిల్లులు చర్చకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా 130వ రాజ్యాంగ సవరణ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ నివేదిక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బిల్లును పరిశీలిస్తున్న జేపీసీ జూలై 17న సమావేశమై తన నివేదికను ఆమోదించే అవకాశం ఉన్నట్లు సమాచారం. అనంతరం నివేదికను పార్లమెంట్ పరిశీలనకు సమర్పించనున్నారు. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర లేదా రాష్ట్ర మంత్రులు అరెస్టై వరుసగా 30 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉంటే వారిని పదవి నుంచి స్వయంచాలకంగా తొలగించాలనే ప్రతిపాదన ఈ బిల్లులో ఉన్నట్లు సమాచారం. జులై 17న జరిగే సమావేశంలో నివేదికకు తుది రూపం ఇచ్చి ఆమోదించనున్నట్లు తెలుస్తోంది. గత పార్లమెంట్ సమావేశాల్లో ఎదురైన పరిణామాల నేపథ్యంలో అధికార ఎన్డీయే ఈసారి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపునకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు గత సమావేశాల్లో దిగువ సభలో ఆమోదం పొందలేదు. దీంతో బిల్లులో మార్పులు చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలను ఒకే విధంగా 50 శాతం పెంచే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపై దక్షిణాది రాష్ట్రాల రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ అంశం కీలకంగా మారింది. మరోవైపు ప్రభుత్వాన్ని పలు అంశాలపై నిలదీసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత సైనికుల ప్రాణనష్టానికి సంబంధించిన అంశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సభను తప్పుదోవ పట్టించారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈ వ్యవహారంలో ఆయనపై సభా హక్కుల ఉల్లంఘన చర్యలు చేపట్టాలనే డిమాండ్‌ను వర్షాకాల సమావేశాల్లో ప్రతిపక్షం ప్రస్తావించే అవకాశం ఉంది.

# వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

**ఎస్ఐ అరవింద్ కుమార్**

**టీ మీడియా, జూలై 4,టేక్మాల్:**వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని వాహనదారులు రహదారి భద్రతా నియమాలను పాటిస్తూ అత్యంత అప్రమత్తంగా ప్రయాణించాలని టేక్మాల్ (ఎస్ఐ) అరవింద్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలో వాహనదారులకు రహదారి భద్రతపై ఆయన ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. వర్షం పడే సమయంలో వాహనాల వేగాన్ని నియంత్రించుకోవాలని, విధిగా హెడ్లైట్లను ఆన్ చేసి ప్రయాణించాలని కోరారు. తడి రోడ్లపై వాహనాలు అదుపు తప్పే ప్రమాదం ఉన్నందున అప్రమత్తత అవసరమన్నారు. ప్రధాన సూచనలువేగ నియంత్రణ వర్షంలో రోడ్లు జారుడుగా మారే అవకాశం ఉన్నందున పరిమిత వేగంతోనే వెళ్లాలి. హెడ్లైట్ల వినియోగం ఎదురుగా వచ్చే వాహనదారులకు కనిపించేలా హెడ్లైట్లను ఆన్ చేసుకోవాలి. పశువుల పట్ల జాగ్రత్త రోడ్లపై అకస్మాత్తుగా సంచరించే పశువుల పట్ల వాహనదారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎస్ఐతో పాటు స్థానిక పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.



# లోపాయికారీ ఒప్పందంతోనే నా ఆస్తిని బ్యాంక్ వాళ్లు అమ్మేశారు

● బండ్ల గణేశ్

**టీ మీడియా,జులై4 , హైదరాబాద్ బ్యూరో :**
ఆస్తి వేలం వివాదంపై సినీ నిర్మాత, వ్యాపారవేత్త బండ్ల గణేశ్ తాజాగా స్పందించారు. తన ఆస్తిని బ్యాంక్ వాళ్లు అన్యాయంగా అమ్మేశారని ఆరోపణలు చేశారు. ఈ మేరకు సోషల్? మీడియాలో ఎక్స్ వేదికగా ఆయన ఇలా పోస్ట్ పెట్టారు. "అన్యాయంగా, మార్కెట్ విలువకు చాలా తక్కువ ధరకు, లోపాయికారీ ఒప్పందంతో బ్యాంకు అధికారులు నా ఆస్తిని విక్రయించారు. ఆ అన్యాయాన్ని సవాలు చేస్తూ 2022లో నేను న్యాయస్థానాన్ని ఆశ్రయించాను. ఈ కేసులో కింద డీఆర్టీ లో నాకు అనుకూలంగా తీర్పు వచ్చింది. అయితే ఇప్పుడు తాజాగా హైకోర్టులో నాకు వ్యతిరేకంగా తీర్పు వెలువడింది. అయినప్పటికీ నాకు భారత న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉంది. అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించి, నా నిజాయితీ, వాస్తవాలు, నా హక్కుల ఆధారంగా న్యాయం సాధిస్తాననే అచంచలమైన నమ్మకం నాకుంది" అని తెలిపారు.

**డీఆర్?టీ ఉత్తర్వులు రద్దు**

లోన్? వసూళ్లలో భాగంగా సినీ నిర్మాత బండ్ల గణేశ్, ఆయన కుటుంబానికి చెందిన ఒక ప్రాపర్టీ హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉంది. ఆ స్థిరాస్తిని యూనియన్ బ్యాంకు వేలం ద్వారా చేసిన విక్రయాన్ని హైకోర్టు సమర్థిస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది. విక్రయాన్ని రద్దు చేయడంతో పాటు వేలం ద్వారా వచ్చిన సొమ్మును



ఆస్తి యజమానులకు చెల్లించాలంటూ రుణ వసూళ్ల ట్రైబ్యునల్ (డీఆర్టీ) ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.

**సర్ఫేసీ చట్టం కింద స్వాధీనం చేసుకున్నాం**

బండ్ల గణేశ్, ఆయన తండ్రి, సోదరుడు తదితరులకు చెందిన ఆస్తి వేలాన్ని రద్దు చేస్తూ డీఆర్టీ ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ యూనియన్ బ్యాంక్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేసింది. బ్యాంకు తరఫున సీనియర్ న్యాయవాది బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపిస్తూ శ్రీపరమేశ్వర పౌల్ట్రీ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ తీసుకున్న లోన్? వసూలులో భాగంగా హామీదారులైన బండ్ల గణేశ్ కుటుంబానికి చెందిన ఆస్తిని సర్ఫేసీ చట్టం కింద 2019లో స్వాధీనం చేసుకున్నామని, 2022లో వేలం నిర్వహించగా రూ.8.51 కోట్ల డబ్బు వచ్చిందన్నారు.

**మాతో అంగీకరించి డీఆర్?టీలో పిటిషన్ వేశారు**

ఇదే సమయంలో పిటిషనర్లు ఓటీఎస్ కింద చెల్లించడానికి అంగీకరించి ముందుకు వచ్చారని, దీనికి బ్యాంకు సుముఖత వ్యక్తం చేసి ఓటీఎస్‌కు అనుమతించిన రూ.82 కోట్లలో వేలం సొమ్ము మినహాయించుకోవాలని చెప్పిందన్నారు. వేలాన్ని సవాల్ చేయడంతో పాటు బ్యాంకుపై వేసిన ఇతర పిటిషన్లను ఉపసంహరించుకోవడానికి బండ్ల గణేశ్ తదితరులు ఒప్పుకున్నట్లు తెలిపారు. అయితే పిటిషన్లను ఉపసంహరించుకోకుండా నేరుగా డీఆర్టీని ఆశ్రయించారని, తాము సమర్పించిన రికార్డులను పరిశీలించకుండా డీఆర్టీ వేలాన్ని రద్దు చేసినట్లు న్యాయస్థానానికి తెలిపారు.

**అది కంపెనీ ఆస్తి కాదు**

ఎన్‌సీఎల్‌టీలో దివాలా పరిష్కార ప్రక్రియను అనుమతించినందున ఆస్తుల క్రయవిక్రయాలపై నిషేధం ఉండగా వేలం నిర్వహించడం చెల్లదన్న వాదన సరికాదని బ్యాంకు తరఫు న్యాయవాది పేర్కొన్నారు. ఇది కంపెనీ ఆస్తి కాదని, హామీదారుల ఆస్తి అని, దానిపై ఎలాంటి నిషేధం ఉండదని వాదనలు వినిపించారు. ఇరుపక్షాల వాదనలను విన్న హైకోర్టు డీఆర్టీ తీర్పును రద్దు చేస్తూ బ్యాంకు నిర్వహించిన వేలాన్ని సమర్థిస్తూ తీర్పును వెలువరించి ఉత్తర్వులను జారీ చేసింది.


# అరచేతిలో ఎన్యూమరేషన్ ఫారం!

● ఒక్క క్లిక్‌తో క్షణాల్లో 'సర్' పూర్తి చేసేయండిలా

**టీ మీడియా,జులై4 , హైదరాబాద్ బ్యూరో :**
తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. గత నెల 25 నుంచి ఇంటింటికీ తిరిగి ఓటర్లకు ఎన్యూమరేషన్ అప్లికేషన్లను పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 24 నాటికి ఓటర్లు వాటిని పూర్తి చేసి, బీఎల్వోలు అధికారులకు అందజేయాలని సూచిస్తున్నారు. కానీ మన అరచేతిలో క్లిక్ దూరంలో కూడా దరఖాస్తు చేసేందుకు సదుపాయం కల్పించారు. మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా క్షణాల వ్యవధిలోనే అప్లికేషన్?ను పూర్తి చేసేందుకు ఇప్పుడు అవకాశం ఉంది. ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలంటే ఓటరు జాబితాలో ఉన్న పేరు, ఆధార్ కార్డులోని పేరు అచ్చుగుద్దినట్లు ఒకేలా ఉండాలి. ఈ సర్? ప్రక్రియను ఆన్?లైన్?లో ఎలా చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఇలా చేయొచ్చు**

ముందుగా గూగుల్?లోకి వెళ్లి జశీవతీం.వఱఱ.స్త్రశీజ.ఱఅ అనే వెబ్‌సైట్‌ను ఓపెన్ చేయాలి. తొలిసారి ఓపెన్ చేస్తే లాగిన్ కోసం




అందులో మొబైల్ నంబర్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. నమోదు ప్రక్రియ పూర్తయితే ఫోన్ నంబర్‌కు ఓటీపీ (వన్? టైమ్ పాస్?వర్డ్??) వస్తుంది. దాని ద్వారా పోర్టల్?లోకి లాగిన్ కావాలి. అనంతరం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) అనే పేరుతో ఫిల్ ఎన్యూమరేషన్ ఫారం అనే ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. ఆ తర్వాత మీ రాష్ట్రం ఏదైతే దానిని ఎంపిక చేస్తే కుడి వైపు మరో ఆప్షన్ కనిపిస్తుంది. అందులో ఓటర్ కార్డు నంబర్‌ను నమోదు చేయాలి. తర్వాత మరో ఆప్షన్ తెరపైకి వస్తుంది. అందులో నమోదైన సెల్?ఫోన్? నంబర్‌ను ఎంటర్ చేస్తే మరో ఓటీపీ వస్తుంది. రాష్ట్రంలో చివరగా 2002లో సమగ్ర ఓటరు జాబితాను తయారు చేశారు. ఆ సమయంలో ఉన్న కుటుంబీకులు తండ్రి లేదా తల్లి ఓటరు ఐడీ ద్వారా కనెక్ట్? చేయాలి. తల్లిదండ్రుల ఓటరు గుర్తింపు నంబర్ తెలుసుకునేందుకు సైతం అక్కడ సెర్చ్ ఆప్షన్‌ను కల్పించారు. వారి 2002లోని ఓటరు కార్డు కావాలంటే వెళ్లి చూసుకోవచ్చు. ఒకవేళ నియోజకవర్గం మారినా, వేరే జిల్లాలో ఉన్నా ఎంపిక చేసుకునే అవకాశాన్ని కూడా ఎన్నికల సంఘం అధికారులు కల్పించారు. దీంతో ప్రక్రియ పూర్తవుతుంది. దరఖాస్తు ప్రక్రియ పూర్తయినట్లు ఓ రిసీట్ జనరేట్ అవుతుంది. దాన్ని అధికారులు పరిశీలించి ఆమోదం తెలిపితే మీ సర్? ప్రక్రియ విజయవంతం అవుతుంది.

**ప్రవాస భారతీయులకూ ప్రత్యేక ఆప్షన్**

ప్రవాస భారతీయులకైతే కుడివైపున ఉన్న ఫర్ ఓవర్సీస్ ఓట్లీ అనే ప్రత్యేక ఆప్షన్‌ను ఇచ్చారు. ఆ ఆప్షన్‌ను ఎంపిక చేసుకొని ఈ సర్? ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఫోన్ నంబర్ ఓటర్ కార్డు లింక్ కాకపోతే ఫాం–8 అప్లికేషన్ నంబర్ ద్వారా లింక్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఆ తర్వాత ప్రక్రియను పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్లేస్టోర్, యాపిల్ స్టోర్ నుంచి ఈసీఐఎన్ఈటీ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకొని కూడా ఈ ప్రక్రియను నిమిషాల వ్యవధిలో చేయొచ్చు.

# ఐటీ కారిడార్స్‌లో కొత్త ట్రెండ్

● మాఫియా నైట్స్ గేమ్‌తో కేఫ్‌లు ఫుల్

**టీ మీడియా,జులై4 , హైదరాబాద్ బ్యూరో :**
మహానగరాల్లోని ఉద్యోగులు తమ ఒత్తిడి నుంచి బయటపడటానికి జిమ్?, యోగాలు మాత్రమే కాకుండా వినోదంపైనా దృష్టి సారిస్తున్నారు. ఎప్పటికప్పుడు సరికొత్త ట్రెండ్స్?ను సృష్టిస్తూ, ఐదు రోజులు పడిన శ్రమను వీకెండ్?లో మర్చిపోయేలా వినూత్న రీతిలో ఎంజాయ్ చేస్తున్నారు. రొటీన్?గా పార్టీలు, పబ్?లు, సినిమాలు, లాంగ్? రైడింగ్?లను మాత్రమే ఎంచుకోవడం లేదు. మెదడును మరింత ఉత్తేజపరిచే మైండ్? గేమ్స్? వైపు సిటీ ఆసక్తి కనబరుస్తున్నారు. హైదరాబాద్?లోని ఐటీ కారిడార్?లో ఇటీవల ఈ తరహా మరో కొత్త గేమ్? హవా నడుస్తోంది.



**పలు పాత్రలను ఎంచుకొని**

మైండ్?స్పేస్? పరసరాల్లోని ప్రముఖ కేఫ్?లు, సోషల్? లాంజ్?ల్లో మాఫియా నైట్? అనే కొత్త ఈవెంట్?లో యువత జోరుగా పాల్గొంటోంది. ఈ గేమ్?ను ఆడేందుకు కొందరు అపరిచిత వ్యక్తులు ఓ ప్రదేశంలో కలుసుకుంటారు. ఇందులో భాగంగా మాఫియా, డాక్టర్లు, పోలీసులు, నగరంలోని స్థానిక వ్యక్తులుగా రహస్య పాత్రలను ఎంచుకుంటారు. వాటికి అనుగుణంగా నటన, వ్యూహాత్మక ఆలోచనలు, సమయస్ఫూర్తిని ప్రదర్శిస్తారు. ఈ క్రమంలో ఎవరు నిజాయతీగా వారి పాత్రను పోషిస్తున్నారో కనిపెట్టడానికి ప్రయత్నిస్తారు. ఈ సమయంలో పరస్పరం వాదించుకుంటారు. సరదాగా నిందలు వేసుకుంటారు. ప్రస్తుతం ఈ వినోదానికి యువత బాగా ఆకర్షితమవుతోంది.

**కొత్త స్నేహితుల పరిచయానికి వేదికగా**

ఈ? మాఫియా నైట్ గేమ్? ఆడాలంటే కనిష్ఠంగా 7గురు కావాల్సి ఉంటుంది. గరిష్ఠంగా 24 మందితో ఆడొచ్చు. గేమ్? సభ్యుల్లో కచ్చితంగా ఒక డిటెక్టివ్, డాక్టర్, వ్యాఖ్యాత (నరేటర్?)గా వ్యవహరిస్తారు. మిగిలిన వారిలో కొందరు మాఫియా గ్యాంగ్?లా, మరి కొంతమంది నగర ప్రజల పాత్రలు పోషిస్తారు. ఇలా ఒకే రకమైన ఉద్యోగం చేసేవారు ఓ చోట కలిసి, కేవలం నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం కోసమే కాకుండా, కొత్త స్నేహాలు చిగురించడానికి ఇదో చక్కని వేదికగా నిలుస్తోంది.

**మాఫియా గేమ్? ఆడేదెలా?**

గేమ్? స్టార్ట్? చేయడానికి ముందే ఉన్నవారిలో ఒకరిని వ్యాఖ్యాత?గా ఎన్నుకుంటారు. మిగిలిన ఆటగాళ్లకు కార్డు లేదా చీటీ రూపంలో వారి పాత్రలను సీక్రెట్?గా కేటాయిస్తారు.

మాఫియా – ఈ పాత్ర వహించేవారు రహస్యంగా నగరవాసులను ఒక్కొక్కరిగా గేమ్? నుంచి ఎలిమినేట్ చేస్తారు. నగర ప్రజలు – తమ మధ్య దాగున్న మాఫియా కిల్లర్స్? ఎవరో కనిపెట్టడమే వీరి లక్ష్యం. పోలీసులు లేదా డిటెక్టివ్?లు – వీరు మాఫియాగా భావించిన వ్యక్తి అవునో కాదో నిర్ధారించుకునేందుకు వ్యాఖ్యాతను సైగలతో అడిగి తెలుసుకుంటారు. డాక్టర్లు – మాఫియా దాడి నుంచి ఇతరులను కాపాడటం వీరి బాధ్యత. ఆట సాగే విధానంలో రెండు దశలుంటాయి. రాత్రి దశ అందరినీ కళ్లు మూసుకొమ్మంటూ వ్యాఖ్యాత ఆదేశిస్తారు. మాఫియా కళ్లు తెరిచి ఒకరిని చంపుతుంది. అనంతరం డాక్టర్? కూడా కళ్లు తెరిచి ఒకరిని కాపాడతారు. చివరిగా డిటెక్టివ్? ఒకరిని తనిఖీ చేస్తారు.

**పగటి దశ**

అందరూ కళ్లు తెరిచే ఆడతారు. రాత్రి చనిపోయిందెవరో వ్యాఖ్యాత ప్రకటిస్తారు. గేమ్?లో ఉండే అందరూ తమలో మాఫియా ఎవరై ఉంటారోనని చర్చించుకుంటారు. అనంతరం ఓటింగ్ ద్వారా ఒకరిని ఎన్నుకొని గేమ్? నుంచి ఎలిమినేట్ చేస్తారు. చివరిగా సభ్యులందరిలో మాఫియాను కనిపెట్టి ఎలిమినేట్ చేస్తే నగరవాసులు విజయం సాధిస్తారు. ఒకవేళ మాఫియా వ్యక్తులు నగరవాసులతో సమానమైతే మాఫియానే గెలిచినట్లు పరిగణిస్తారు.

**దేశంలోని ప్రధాన నగరాల్లో కూడా**

ఈ మాఫియా గేమ్? కేవలం మన హైదరాబాద్?లోనే కాదు దేశంలోని ప్రధాన నగరాల్లోనూ ట్రెంట్? అవుతోంది. ప్రధాన ఐటీ హబ్? బెంగళూరులో పెద్ద పెద్ద కేఫ్?లలో ఈ ఈవెంట్లకు ఆడేందుకు ఏకంగా బుక్? మై షో ద్వారా టికెట్లను బుక్ చేసుకొని పాల్గొనవచ్చు. దేశ రాజధాని దిల్లీలో రాత్రివేళలో స్పెషలిస్ట్? గేమ్? కేఫ్?లు ఈ ఆటకు ఆతిథ్యం అందిస్తున్నాయి. ముంబయిలోని అంధేరి, జుహూ ప్రాంతాల్లో మాఫియా నైట్స్?ను గేమింగ్? క్లబ్?లలో వినూత్నంగా నిర్వహిస్తున్నారు. నేరుగానే కాకుండా మొబైల్?లో ఆడేందుకు మాఫియా నైట్స్ పేరుతో?? యాప్స్? కూడా అందుబాటులో ఉన్నాయి.

# భర్తను చంపి బాత్రూమ్‌లో పాతిపెట్టిన భార్య

● దృశ్యం సినిమా లెవల్‌లో ప్లాన్?!

**టీ మీడియా,జులై4 , ఢిల్లీ బ్యూరో :**
భర్తను చంపి శవాన్ని డ్రమ్ములో పెట్టి కప్పివేయడం, లేదంటే కొండపై నుంచి తోసేయడం వంటి వార్తలు ఇటీవల కాలంలో మనం ఎక్కువగా వింటున్నాం. తాజాగే అలాంటి ఘటనే మరొకటి వెలుగులోకి వచ్చింది. ఓ ఇల్లాలు భర్తను చంపి, ఆపై శవాన్ని బాత్రూమ్?లో పూడ్చిపెట్టింది. అంతేకాదు, ఎవరికి అనుమానం రాకుండా ఆ ప్రదేశంలో కొత్త టైల్స్?ను ఏర్పాటు చేయించింది. స్థానికులు భర్త గురించి అడగ్గా, కొద్దిరోజులుగా ఆయన కనిపించడం లేదంటూ అందరితో నమ్మబలికింది. చివరికి పోలీసుల ఎంట్రీతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దృశ్యం సినిమాను తలపించే ఈ ఘటన ఉత్తర్?ప్రదేశ్?లో జరిగింది.



**పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, :** భరత్?పుర్?, రంజిత్? నగర్?కు చెందిన సురేంద్ర శర్మ(44), భార్య రూబీతో ఆగ్రాలోని రేణుకా ధామ్? కాలనీలో నివాసం ఉంటున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. అయితే, మే 18న తన భర్త కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులకు చెప్పింది రూబీ. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, రూబీ మాటలపై సురేంద్ర సోదరుడు అనిల్?కు అనుమానం కలిగింది. తన సోదరుడు అదృశ్యంపై ఆమె తరచూ పొంతనలేని సమాధానాలు చెబుతుండడంతో ఆయన అనుమానం మరింత బలపడింది.

**నేరం ఎలా బయటపడిందంటే? :** అనిల్?, తన తల్లి పెన్షన్ డబ్బుల కోసం ఆరా తీయగా అసలు విషయం బయటపడింది. "తొలుత డబ్బులు విత్?డ్రా చేశావా? అని రూబీని అడగ్గా తాను చేయలేదని చెప్పింది. నాకు అనుమానం వచ్చి, మా అమ్మను నాతో పాటు బ్యాంకుకు తీసుకెళ్లి అడగ్గా, అప్పటికే విత్?డ్రా అయినట్లు తెలిసింది. మా అమ్మ బ్యాంక్ ఖాతా పాస్‌బుక్, డెబిట్ కార్డును రూబీ తన వద్దే ఉంచుకుంది. నేను రూబీతో, డబ్బు నాకు ఇవ్వమని అడగ్గా, రూబీ మౌనంగా ఉండిపోయింది. ఆ తర్వాత, శుక్రవారం ఉదయం 6 గంటలకు, ఆమె నాకు ఫోన్ చేసి తన భర్త ఇంట్లో ఉన్నాడని, అక్కడికి రమ్మని చెప్పింది. నా సోదరుడు సురేంద్రతో మాట్లాడటానికి వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు, రూబీ తన భర్త బాత్రూంలో ఉన్నాడని చెప్పింది. నేను వెళ్లి చూడగా, బాత్రూంలో ఎవరూ లేరు. నేను, "అక్కడ ఎవరూ లేరు" అని చెప్పగా, రూబీ, "రెండు అడుగులు కింద ఉన్నాడు" అని బదులిచ్చింది. అది వినగానే నాకు చాలా భయం వేసింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాను" అని అనిల్? పేర్కొన్నాడు.

**విచారణలో పొంతన లేని సమాధానాలు :** పోలీసులు ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణ సమయంలో నిందితురాలు పొంతనలేని సమాధానాలు చెబుతూ వచ్చిందని పోలీసులు తెలిపారు. సురేంద్ర ఆత్మహత్య చేసుకున్నాడని, దాన్ని చూసి భయం వేసి మృతదేహాన్ని పాతిపెట్టానని చెప్పిందన్నారు. అయితే, ఆమె మాటలు నమ్మశక్యంగా లేవని అన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక, ఫోరెన్సిక్ విశ్లేషణ తర్వాతే మరణానికి అసలు విషయం తెలుస్తుందని పోలీసులు పేర్కొన్నారు. "సురేంద్రకు ఉన్న మద్యపాన వ్యసనం వల్ల తరచుగా గొడవలు జరిగేవి. మద్యం సేవించిన తర్వాత నన్ను కొట్టేవాడు. అంతేకాకుండా, నేను ఇంట్లో దుస్తులు కుట్టి సంపాదించినదంతా అతను లాక్కునేవాడు" అని విచారణలో నిందితురాలు చెప్పిందని పోలీసులు తెలిపారు. "హత్య ఎలా జరిగింది? ఇందులో మరెవరికైనా ప్రమేయం ఉందా? ముఖ్యంగా హత్య ఎప్పుడు జరిగింది? మృతదేహాన్ని పాతిపెట్టడంలో ఎవరు సహాయపడ్డారు? అనే విషయాలను నిర్ధరించే పనిలో పోలీసులు ఉన్నారు. పోస్ట్‌మార్టం నివేదిక, ఫోరెన్సిక్ ఆధారాలు, సాంకేతిక విచారణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు.